తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

### గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువు

# ముగిసిన సాక్షాత్కార వైభవోత్సవాలు



చంద్రగిరి, జూలై 12 ప్రభాతవార్త: భక్తజనుల గోవింద నామస్మరణల నడుమ శ్రీ మహావిష్ణువు తన నిత్య వాహనమైన గరుడ వాహన సేవ శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి సాక్షాత్కార వైభవోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులకు పాలు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, గంధంతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు ఆలయ ఆవరణలో స్వామి వారు శ్రీదేవి భూదేవి సమేతుడై ఊజంల్‌పై సేదదీరారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చి వివిధరకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. శ్రీ హరి నిత్యవాహనమైన గరుడుడిని వేదస్వరూపుడిగా, రెక్కలను వేదం నిత్యత్వానికి, అపౌరుషయత్నానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. గరుడుని సేవాదృక్పథం, మాతృభక్తి, ప్రభుభక్తి, సత్యనిష్ఠ, నిష్కళంకత, ఉపకారగుణం సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. అట్టి గరుడుడిని వాహనంగా చేసుకుని శ్రీమహావిష్ణువు అలంకరణల స్వామి వారు తిరుమాడ వీధులలో విహరిస్తుండగా దర్శించుకోవడం ద్వారా సకల పాపహరణ, మోక్షప్రాప్తి లభిస్తుందని శాస్త్రాలు వివరిస్తున్నాయి. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్స్ టి.వెంకటస్వామి, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.12 కోట్లతో మోడ్రన్ చిత్తూరు రైల్వేస్టేషన్

**- చిత్తూరులో అన్నిరైళ్ళు స్టాపింగ్‌కు చర్యలు**

**- రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**



చిత్తూరు రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న ఎంపీ

చిత్తూరు రూరల్, జులై 12 ప్రభాతవార్త: చిత్తూరు రైల్వే స్టేషన్‌ను రూ.12 కోట్లతో ఆధునీకరించి మోడ్రన్ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. అలాగే చిత్తూరు రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్ళకు స్టాపింగ్ వుండేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ పేర్కొన్నారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు శుక్రవారం చిత్తూరు రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేయడానికి వచ్చిన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావును రైల్వే అధికారులు, పోలీసులు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు రైల్వేస్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమై రైల్వేస్టేషన్ సామర్థ్యం, సమస్యలు, రైళ్ళ రాకపోకలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు రైల్వేస్టేషన్ స్థితిగతులను ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ మాట్లాడుతూ రైల్వే సమస్యలు, జరుగుతున్న పనుల వివరాలు, అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి తనకు పంపాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీ దగ్గుమళ్ళ విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు రైల్వేస్టేషన్‌ను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతా మన్నారు. చిత్తూరు రైల్వే స్టేషన్ గుండా 37 రైళ్ళు వెళ్తున్నాయని ఇందులో ఆరు రైళ్ళు చిత్తూరు రైల్వే స్టేషన్‌లో ఆగడం లేదని మిగిలిన రైళ్ళు ఆగుతున్నాయన్నారు. చిత్తూరు రైల్వే స్టేషన్‌లో ఆగకుండా వెళ్తున్న రైళ్ళు సైతం చిత్తూరు రైల్వే స్టేషన్‌లో ఆగేవిధంగా తాను రైల్వే ఉన్నత అధికారులకు వినతిపత్రం అందజేస్తానన్నారు. అలాగే కమర్షియల్ మార్గం ద్వారా చిత్తూరు రైల్వే స్టేషన్‌కు ఆదాయం పెంచడానికి కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు రైల్వేలో రాయితీ ప్రయాణం కల్పించడానికి ప్రయత్నిస్తానని ఎంపీ పేర్కొన్నారు.

### మీరు చెప్పినట్లు చేస్తాం!

# మంచి సర్కిల్ ఇప్పించండి

**-ఖద్దరు నేతల చుట్టూ పోలీసుఅధికారుల వినయం**



ప్రభాతవార్త-తిరుపతి: తిరుపతి,చిత్తూరు జిల్లాలో పోలీసు శాఖలో మంచి సర్కిళ్ళలో, సబ్‌డివిజన్లలో పోస్టింగ్‌లకోసం పలువురు పోలీసు అధికారులు తమతమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాష్ట్రంలో నూతన టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో వైసిపితో అంటకాగిన పోలీసు అధికారులను ఇప్పటికే సగంమందిని దూరంగా పెట్టేశారు. ఇప్పుడు ఉన్న అరకొర ఎస్ఐలు, సిఐలు, డిఎస్పీలు అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు మీరు చెప్పినట్లు చేస్తాం...మాకు మంచి సర్కిల్ ఇప్పించండి..ఫలానా పోలీసు స్టేషన్‌కు బదిలీ చేయండంటూ ప్రతిరోజూ నేతల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ ప్రసన్నం చేసుకునేలా ఉంటున్నారు. తిరుపతి జిల్లా పోలీసుశాఖ పరంగా పాతదైనా కొత్త జిల్లాలో పూర్వపు నెల్లూరు జిల్లాలోని కొన్ని మండలాలు కలిశాయి. దీంతో నాలుగైదు పోలీసు సబ్‌డివిజన్లు , ఆరేడు పోలీసు సర్కిళ్ళు కొత్తగా తిరుపతి జిల్లాలో కలిశాయి, అక్కడ గూడూరు సబ్‌డివిజన్,శ్రీసిటీ, నగరి సబ్‌డివిజన్లకు డిఎస్పీ స్థాయి అధికారులుతమను పోస్టింగ్ ఇప్పించండిఅని కొందరు టిడిపి, జనసేన నేతలకు విజ్ఞప్తి చేసుకొంటున్నారు. మరీ ఏకంగా తిరుపతి సబ్‌డివిజన్‌తో బాటు తిరుమల సబ్‌డివిజన్, చంద్రగిరి సబ్‌డివిజన్,రేణిగుంట, శ్రీకాళహస్తి ,తిరుపతి క్రైమ్, ట్రాఫిక్ సబ్‌డివిజన్ డిఎస్పీలు అందరూ కూడా ఎన్నికల సమయంలో నియమితులైనవారే. అయితే ఇప్పటికే పలువురు డిఎస్పీలు గత వైసిపి నేతలతో చట్టపట్టాలు వేసుకుని తిరిగారని, ఏకంగా టిడిపి, జనసేన కార్యకర్తలను నేతలను ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఇప్పటికే జిల్లా పర్యటనలో పోలీసుశాఖను పూర్తిగాప్రక్షాళన చేస్తానని పార్టీ నేతలు, కార్యకర్తలకు భరోసా కల్పించారు. ఇప్పుడు నెలరోజుల పాలన పూర్తికావడంతో పోలీసు అధికారుల బదిలీలు జరగడానికి సమయం ఆసన్నమైంది. ఒకరోజు ముందు రాష్ట్రంలో పలువురు ఐజిలు, డిఐజిలను బదిలీ చేసిన ప్రభుత్వం శని,ఆదివారాల్లో జిల్లాల ఎస్పీల బదిలీలు చేపట్టనుంది. చిత్తూరు,తిరుపతి జిల్లాలకు ఎన్నికల సమయంలో వచ్చిన నూతన ఎస్పీలు కొనసాగుతున్నారు. ఇద్దరూ ప్రభుత్వం సూచనల మేరకు పాలన సాగిస్తున్నా గతంలో వైసిపి నేతలపట్ల కఠినంగా వ్యవహరించ లేకపోయారనే కొంత అభిప్రాయం కూడా టిడిపి, జనసేన నేతలు వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు జిల్లా ఎస్పీ బదిలీ దాదాపు ఖరారైందని, తిరపతి జిల్లా ఎస్పీ బదిలీ అనివార్యమేనని అధికార పార్టీల నేతలు చెబుతున్నారు. ఇంకా తిరుపతి సబ్‌డివిజన్‌లో అలిపిరి, ఈస్టు, తిరుచానూరు, వెస్టు, ఎస్వీయూ పోలీసుస్టేషన్‌లకు కొత్త ఎస్ఐలు రానున్నారు. ప్రస్తుతం ఆయా స్టేషన్‌లలో ఉన్న ఎస్ఐల పనితీరుపై పలు విమర్శలు, ఆరోపణలు వున్నాయి. చిత్తూరుజిల్లాలో దాదాపు ఇదే పరిస్థితి ఉంది. చాలావరకు సిఐలు, ఎస్ఐలు తమకు మంచి స్టేషన్‌లలో పోస్టింగ్‌లు ఇప్పించాలని అధికార పార్టీనేతల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు మాత్రం ముఖ్యమంత్రి సొంత జిల్లాలో శాంతిభద్రతలు, భూవివాదాలు తలెత్తకుండా చూసే మంచి అధికారులను కొంచెం సీనియార్టీ మేరకు నియమించే అవకాశం ఉంది. ఇదే సమయంలో తమకు అనుకూలమైన పోలీసు అదికారులను నియమించు కునేందుకు ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు ఇస్తున్నా దీనివెనుక ఎలాంటి ఒత్తిళ్ళు లేకుండా ,రాజకీయ జోక్యం లేకుండా మంచి అధికారులనే నియమించాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. సిఐలు, డిఎస్పీ అధికారుల పోస్టింగ్‌లలో మూడు పేర్లతో ప్రతిపాదనలు అనే కొత్త విధానం అమలుచేయనున్నా రనేది తెలుస్తోంది. దీంతో తిరుపతి చిత్తూరుజిల్లాలో రెండు మూడురోజుల్లో అంతా కొత్త పోలీసు అధికారులు రానున్నారనేది పోలీసుశాఖలో చర్చమొదలైంది.

# పేదరికం లేని...కుప్పం కోసం పనిచేస్తా

**- కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్**



సమావేశంలో ప్రసంగిస్తున్న కడ పి.డి. వికాస్ మర్మత్

కుప్పం, జూలై 12 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పేదరికం లేని కుప్పం కోసం పనిచేస్తానని కడ నూతన ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. శుక్రవారం కడ పి.డి.గా బాధ్యతలు చేపట్టిన అనంతరం కుప్పం తహశీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి మాట్లాడారు. సిఎం చంద్రబాబు నాయుడు కుప్పం ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొంది ంచారన్నారు. కుప్పం ప్రాంతంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరచేలా కృషి చేస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు టమోటా, పట్టు, హార్టీకల్చర్, ఇతర పంటలసాగు ఉత్పత్తులు పెంచి వీటికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకుని యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అదేవిధంగా ద్రవిడ విశ్వవిద్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుకు చర్యలు తీసుకుంటామన్నారు. కుప్పం మున్సిపల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధితో పాటు బస్టాండు, పార్కుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే ఐటి విధానంను సైతం యువతకు అందుబాటులో తెస్తామన్నారు. కుప్పంలో పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ విధానంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. తనపై ఎంతో నమ్మకంతో కడ ప్రాజెక్టు అధికారిగా ముఖ్యమంత్రి నియమించారని అందుకు తగిన విధంగా తాను విధులు నిర్వహిస్తానన్నారు. ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కుప్పం సమగ్ర అభివృద్ధికి తనవంతు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. కుప్పంలో తనకు అపూర్వ ఘనస్వాగతం పలకడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అంతకుముందు స్థానిక ఆర్టీసీ డిపో, పార్కును ఆయన పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, సురేష్, వేలు, జాకీర్, సెల్వరాజ్, నేతలు సత్యేంద్రశేఖర్,మంజు, నరేష్, ఉమాపతి, శివశంకర్, మణి, మురళి, అన్సర్

## పంట పొలాలపై ఏనుగుల విధ్వంసం



టమోట పంటను నాశనం చేసిన ఏనుగుల గుంపు

సోమల, జులై 12 ప్రభాతవార్త : గత కొద్ది నెలలుగా ఏనుగుల గుంపు పంట పొలాలపై పడి విధ్వంసం సృష్టిస్తుండడంతో రైతులు గురువారం రాత్రి 81 చిన్న ఉప్పరపల్లి పంచాయితీలో 17 ఏనుగులు మందగ ఏర్పడి పంట పొలాలపై దాడి అపారనష్టం కలిగించాయి. చీకలవారిపల్లికి చెందిన మునీశ్వర రావు టమోటా పంటపై దాడి చేయడంతో రెండు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. అలాగే గురికివానిపల్లికి చెందిన నక్కింటి శంకరయ్య పొలం పై పడి టమోటా పంట నాశనం చేయడంతో లక్ష రూపాయిల వరకు నష్టం వాటిల్లింది రాత్రి వేళల్లో గ్రామాల్లోకి సైతం ఏనుగులు గుంపు వస్తున్నడంతో ప్రజలు ప్రాణ భయంతో చీకటి పడగానే తలుపులు వేసుకొని ఇండ్లకే పరిమితం అవుతున్నారు. తీరా నష్టం జరిగాక అటవి అధికారులు వచ్చి పంట నష్టం అంచనావేసి ఉన్నతాధికారులు పంపుతున్నారు. ప్రభుత్వం వారిచ్చే నష్టపరిహారం ఒక బస్తా ఎరువుకు కూడా సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులు తినేదానికన్నా తొక్కి ఎక్కువ నష్టం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే అటవీ సమీప ప్రాంతాలలోని రైతులు వ్యవసాయం మానుకొని పట్టణాలకు వలసలు వెళ్లే పరిస్థితి నెలకొంది. ఇకనైనా ప్రబుత్వ యంత్రాంగం మేల్కొని రైతులకు అండగా నిలబడాల్సి ఉంది.

## ఇసుక అక్రమ రవాణాకు 'చెక్' పెట్టేనా



తడ వద్ద ఇసుక రవాణా వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

తడ, జూలై 11 ప్రభాతవార్త : ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల మధ్య ఇసుక అక్రమంగా తరలిపోకుండా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే కొన్ని ఇసుక రీచ్‌ల నుంచి ఉచితంగా స్థానికులు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ మాటున పొరుగున ఉన్న తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. తమిళనాడు వారు అక్కడ భవన నిర్మాణాలు, ఇతర అవసరాల కోసం ఆంధ్రా ఇసుక కోసం ఆవురావురంటున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనేక చోట్ల ఇసుక గుట్టలు పేరుకుపోయాయి. ప్రభుత్వం మారిన తర్వాత కేవలం రవాణా ఛార్జీలుతో సామాన్యులకు కూడా అందుబాటులో ఉంచడం వల్ల స్థానికంగా మేలవు తుందని భావించినప్పటికీ, అదే సాకుతో ఈ రవాణా సరిహద్దులు దాటేస్తుందని తెలుస్తోంది. గతంలో తడకు సమీపంలోని తమిళనాడుకు చెందిన ఆరంబాకం గ్రామం మీదుగా మళ్లీ తడ మండలం గ్రామాలను దాటుకొని ఇసుకను తమిళనాడుకు తరలించేవారు. ఆ సమయాన ఆంధ్రా ప్రాంతంలోని తిరుపతి జిల్లా తడ మండలం పెరియవట్టు, రామాపురం, పన్నంగాడు వంటి గ్రామాలలో అభివృద్ధి పనులకు కూడా ఇసుకను తీసుకెళ్లడం ఇబ్బందిగా మారింది. ఈ సమస్య ఇప్పుడు ఇసుక అక్రమ రవాణా జరిపేందుకు అనుకూలంగా మారిందని సరిహద్దు గ్రామాల ప్రజలు అంటున్నారు. ప్రస్తుతానికి తడ వద్ద ఇసుక టిప్పర్లు, లారీలను తనిఖీ చేస్తున్నారు తప్ప వాటిని నిశితంగా పరిశీలించి ఆంధ్రా ప్రాంతానికి కాకుండా తమిళనాడుకు తరలిస్తున్నారేమో అనే అనుమానాలు లేకపోలేదు. తిరుపతి జిల్లా ఉన్నతాధికారులు ఇటు వైపు దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు.

### మత్తుకు బానిసలైన యువకులు...

# మితిమిరిపోతున్న... ఆకతాయిల ఆగడాలు

పాకాల, జులై 12 ప్రభాతవార్త : పాకాల మండల పరిధిలో గల ప్రభుత్వ ఉన్నత పాటశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ప్రతిరోజు కొందరు (యువత) ఆకతాయిలు బైకులపై వీరంగం సృష్టిస్తున్నారు. ఇది ఏంటి అని ప్రశ్నించే వారిపై దాడులకు ప్రయత్నిస్తున్నారు. మార్కెట్ యార్డ్‌ని వీరికి అడ్డా చేసుకున్నారు. రైల్వే గేటు నుంచి ఎమ్మార్వో ఆఫీసు మధ్యలో పాఠశాల, జూనియర్ కళాశాల ఉన్నది. ప్రతిరోజు విద్యార్థులు స్కూలుకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో ఆడపిల్లలే లక్ష్యంగా బైకులపై విన్యాసాలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా నగరం మధ్యలో ఉన్న ప్రభుత్వ జూనియర్ గార్ల్స్ కాలేజీ చుట్టు పక్కల ఇలాంటి పరిస్థితి నెలకొని ఉంది. నెంబర్ ప్లేట్లు, సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులను సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నగరంలో రోడ్డు పై చిన్న పిల్లలు, వృద్ధులు నడవాలంటే భయపడి పోయే పరిస్థితి నెలకొంది. ఆకతాయిల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా విద్యార్థిని తల్లిదండ్రులు, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా రైతు కార్యవర్గ సభ్యులు కె. వెంకటాద్రి నాయుడు కోరారు.

## మహిళలకు మనోధైర్యం, భద్రత కల్పిస్తే సమాజం సుస్థిరం : ఎస్పీ




చిత్తూరు రూరల్, జులై 12 ప్రభాతవార్త: మహిళలకు మనోధైర్యం, భద్రత కల్పిస్తే సమాజం మరింత సుస్థిరంగా వుంటుందని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన కుటుంబ సలహా కేంద్రం(ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్)ను శుక్రవారం ఎస్పీ మణికంఠ చందోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ సలహా కేంద్రం ఏర్పాటుతో మహిళా భద్రత, సమాజంలో శాంతి భద్రతలను కాపడటంతో మరో అడుగు ముందుకు వేసినట్లు అయ్యిందన్నారు. ఈ సలహా కేంద్రం ద్వారా కుటుంబ సమస్యలను పరిష్కరించడమే కాకుండా మహిళలపై జరిగే హింసను తగ్గించడం లక్ష్యంగా విధులు నిర్వర్తించాలన్నారు. కుటుంబాల్లో వివాదాలు తలెత్తితే కుటుంబ సలహా కేంద్రం ద్వారా ఈ వివాదాలను సమర్థవంతంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, చిత్తూరు ఇన్‌ఛార్జీ డిఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాధరెడ్డి, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మన్న, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు, న్యాయవాది మేరి, డాకర్లు, జయప్రియ, భూదేవి, రిటైర్డ్ ఎస్ఐ రషీద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అందరం కలిసి...అభివృద్ధి వైపు పయనిద్దాం

**- సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ**




సమావేశంలో మాట్లాడుతున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే

తడ, జూలై 12 ప్రభాతవార్త : అధికారులు, ప్రజాప్రతినిధులు అందరు కలిసి తడ మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె తడలో జరిగిన 12వ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి తొలిసారి ఎన్నికైన మహిళగా గుర్తింపు తెచ్చుకున్న విజయశ్రీని ఈ సందర్భంగా పలువురు ఘనంగా సన్మానించారు. విజయశ్రీ మాట్లాడుతూ మండల పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులతో విజయశ్రీ మాట్లాడారు. మండల అభివృద్ధి ప్రోగ్రెస్‌తో పాటు విడుదలైన నిధులు గురించి ఆరా తీశారు, పెండింగ్ పనులపై ప్రస్తావించారు. అత్యవసరంగా జరపాల్సిన పనులను తెలుసుకున్నారు. ఈ సమావేశం కొత్త, పాత మధ్య అన్నట్లుగా గత ప్రభుత్వంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు, నూతన కూటమి ప్రభుత్వంలో గెలిచిన ఎమ్మెల్యే ఉండటం వల్ల పలువురు సర్పంచులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయారు. ఎంపిటిసిలది సైతం అదే దారి. వైసీపీకి చెందిన జడ్పిటిసి సభ్యురాలు హాజరు కాలేదు. ఇద్దరు ఉప మండలాధ్యక్షులలో ఒక్కరు మాత్రం వచ్చారు. అయితే వైసీపీలో ఉన్న మండలాధ్యక్షుడు కొళవి రఘురెడ్డి మాత్రం హాజరయ్యారు. ఆయన ఆధ్వర్యంలో కొందరు వైసీపీ నాయకులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. ఊరి మధ్య మద్యం షాపు వద్దు తడ మండలం రామాపురంలో ఊరి మధ్య మదనయం షాపు ఉందని, దాన్ని వేరేచోటుకు తరలించాలని అధికార పార్టీకి చెందిన సర్పంచ్ టికె శ్రీనివాసన్ పేర్కొన్నారు. మహిళలు ప్రతిరోజు సచివాలయానికి వచ్చి విన్నవించుకుంటు న్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న రామాపురం ప్రాంతంలో తమిళ టీచర్‌ను నియమించాలని ఆయన కోరారు. గ్రద్దగుంట ఎంపిటిసి, వైస్ ఎంపిపి కుప్పంపాటి వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న బెల్టుషాపులను నిర్మూలించాలన్నారు. ఈ సమావేశానికి సెబ్ అధికారి కూడా రావడం విశేషం. జలవనరుల శాఖకు సంబంధించి కాళంగి గ్రాయనుతో పాటు గండ్లు, చెరువుల సమస్యను ఏఇ రమేష్ మాట్లాడుతూ గతంలో టెండర్లు పిలిచినా ఇంకా పనులు పూర్తి కాలేదన్నారు. వెండ్లూరుపాడు సర్పంచ్ చిల్లకూరు మునిరత్నంరెడ్డి తమ గ్రామ సమస్యలు వివరించేటప్పుడు ఇటీవల మాంబట్టు సెజ్‌లో జరిగిన అగ్నిప్రమాదం చర్చకు వచ్చింది. అక్కడ పొగ విపరీతంగా బయటకు రావడంతో సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కాలుష్యం నుంచి గ్రామీణ ప్రజలను కాపాడాలని కొందరు డిఎల్‌పిఓ దృష్టికి తీసుకొచ్చారు. డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటశేషయ్య, డిఎల్‌పిఓ రవీంద్రబాబు, ఎంఇఓ మల్లికార్జునరావు, వ్యవసాయశాఖ అధికారి కాంచన, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ భవాని, గృహ నిర్మాణశాఖ అధికారి సత్యనారాయణ, విద్యుత్ ఏఇ మురళి, రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మస్తానయ్య, ఏపీఎం రాజారెడ్డి తదితర అధికారులు మాట్లాడారు.

# పేదవాడి బతుకు జీవనం మారాలి!

**పంచాయతీ కార్యదర్శులతో ఎంఎల్ఏ సమీక్ష**




పంచాయతీ కార్యదర్శులతో సమీక్షసమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త : పేదవాడి బతుకు జీవనం మారాలి,ప్రతి గ్రామంలో మార్పురావాలి అని ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుదీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో శ్రీకాళహస్తి, రూరల్, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలకు సంబందించి ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి డిపిఓ సుశీలదేవి, శ్రీకాళహస్తి డివిజన్ అభివృద్ధి అధికారి మరియు చిత్తూరు డిప్యూటీ సిఈవో ఆదిశేషారెడ్డి, నాలుగు మండలాల ఎంపిడిఓలు హజరయ్యారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాను 98,860 కుటుంబాల ఇంటింటికి వెళ్ళి పర్యవేక్షించానని వివరించారు. పనిచేయని వారిని బదిలీ చేసి వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తామన్నారు. సోమవారం నుంచి గురువారం వరకు ప్రతి ఒక్కరు పనిచేయాలని పేదవాడి బతుకు జీవనం మారాలని ప్రతి గ్రామంలో మార్పురావాలని పంచాయతీ కార్యదర్శు లకు సూచించారు. తాను అమెరికాలో ఉన్నపుడు కూడా పనిచేసేవాడినే అని అందుకే అందరినీ సమానంగా చూస్తానని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్యం అధ్వాన్నంగా మారిందని పంచాయతీ కార్యదర్శులు పద్దతి మార్చుకోవాలని తెలిపారు. తాను ఎప్పుడో గ్రామాల్లోను, పట్టణంలోను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని అధికారులు అక్కడ లేకపోతే సస్పెండ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఏర్పేడు మండలం ఎండిపుత్తూరులో పారిశుద్యం అధ్వాన్నంగా మారిందని డ్రైనేజీ కాలువలు పరిశుభ్రం చేయాలన్నారు. వెంకటాయపాళెంలో తానే స్వయంగా వీధిలైట్లు వేయించానన్నారు. నియోజకవర్గం లోని రేణిగుంటలో మంచినీటి ఐదేళ్ళ నుంచి సమస్య తీవ్రంగా ఉందని వీధుల్లో పారిశుద్య అధ్వానంగా మారిందని ఇందుకు అధికారులు సిగ్గుపడాలన్నారు. 45రోజుల్లో నియోజకవర్గంలో మార్పురావా లన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని పేదవాడి బతుకు జీవనంతో ఆడుకోవద్దని తెలిపారు. ప్రస్తుతం డయేరియా ప్రబలుతోందని పారిశుద్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, శ్రీకాళహస్తి మండల, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల అధ్యక్షులు కామేష్‌యాదవ్, గాలిమురళీనాయుడు, పొన్నారావు, చిన్నారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, బిజెపి నాయకులు అమర్నాధ్, కాసరం రమేష్, మునిరాజ నాయుడు, ధనంజయులు నాయుడులతో పాటు నాలుగు మండలాల ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు హజరయ్యారు.

## గన్‌మెన్ ఫైరింగ్ ప్రాణాలు రక్షించే బాణం : ఎస్పీ



**చిత్తూరు రూరల్, జులై 12 ప్రభాతవార్త:** గన్‌మెన్లుగా విధులు నిర్వర్తించే వారు అత్యవసర సమయాల్లో ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సిద్ధమై వుండాలని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు సమీపంలోని చిత్తూరు పోలీసుశాఖకు చెందిన ఫైరింగ్ రేంజ్‌లో జరుగుతున్న గన్‌మెన్ల ఫైరింగ్ ప్రాక్టీస్‌ను శుక్రవారం ఎస్పీ మణికంఠ చందోలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు రకాల తుపాకులతో నీల్ పోజిషన్, స్టాండింగ్ పోజిషన్, లయింగ్ పొజిషన్‌లో అత్యాధునిక ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేసి సిబ్బందితో ఉత్సాహం, మనోధైర్యంను నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు కీలకమని, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులకు గన్‌మెన్లుగా విధులు నిర్వర్తించే వారు అత్యవసర సమయాల్లో ప్రాణ రక్షణకై ఎల్లవేళల సంసిద్ధులై వుండాలన్నారు.ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీలు మహబూబ్‌భాషా, ఇలియాజ్‌భాషాలు, ఆర్ఐ అడ్మిన్ సుధాకర్, ఆర్ఎస్ఐలు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి: ఎమ్మెల్యే

**పెద్దపంజాణి జులై 12 ప్రభాతవార్త :**పలమనేరు నియోజకవర్గంలో ప్రభుత్వపాఠశాలల అభివృద్ధికి తనవంతు సహకారమందిస్తానని ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొత్తగా జూనియర్ కళాశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వపాఠశాలల అభివృద్ధి ఉపాధ్యాయులతోనే సాధ్యమౌతోందని ఆ దిశగా ఉపాధ్యాయులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఈఓ పురుషోత్తం,ఎంఈఓలు గోపాల్ రెడ్డి, తులసిరామ్, హెచ్ఎం కేశవపిళ్ళై, తహశీల్దార్ నాగేంద్ర,ఎంపిడిఓ అబ్దుల్ రహీం,ఎంపిపి రెడ్డెప్ప,జెడ్పిటిసి సుష్మాకీర్తి,సర్పంచ్ అఖిల,మాజీ ఎంపిపిలు విజయ్‌భాస్కర్ రెడ్డి,మురళి,సీనియర్ నేతలు చెంగారెడ్డి,సుధాకర్ రెడ్డి,శ్రీరాములు రెడ్డి,నాగరాజురెడ్డి,ఆనంద,క్రిష్ణారెడ్డి,రవి శెట్టి,నాగరాజు,బావాజాన్. తధితరులు పాల్గొన్నారు.

## సిఎం చొరవతో కుప్పాన్ని ఆదర్శం చేస్తాం : ఎమ్మెల్సీ,



**కుప్పం, జులై 12 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు చొరవతో కుప్పాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కడ పి.డి.వికాస్ మర్మత్‌తో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలోనే సిఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి అంటే ఏమిటో చేసిచూపారన్నారు. వచ్చే ఐదేళ్లలో ఈ ముప్ఫై ఏళ్లలో జరిగిన అభివృద్ధికి మించి రెట్టింపు అభివృద్ధి చేసి చూపుతామన్నారు.కుప్పం ప్రాంతంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కుప్పంలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని పేర్కొన్నారు.

## అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

**శాంతిపురం, జులై 12 ప్రభాతవార్త :** కర్ణాటకనుంచి అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తికి పద్నాలుగు రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మండలంలోని చిన్నకర్లగట్టకు చెందిన గోవింద్ అలియాస్ సత్తార్ ('36) కర్ణాటకనుంచి 15 లీటర్ల కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తరలిస్తూ గెసికపల్లి క్రాస్ వద్ద వాహనంతో సహా పట్టుబడినట్లు తెలిపారు.

## రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ



**రామకుప్పం, జులై 12 ప్రభాతవార్త :** రామకుప్పం మండలం కె ఒపసముద్రం ప్రభుత్వ పాఠశాలలో రాజ్యాధి కారం టీం అధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు పుస్తకాలు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో కుప్పం ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే బగళనత్తం గ్రామంలో రైతులకు ప్రభుత్వం తరపున మొక్కజొన్న, పశుగ్రాసం విత్తనాలను రాయితీతో రైతులకు అందించారు.చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునస్వామి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, పత్ర నారాయణ, చలపతి, చిన్నికృష్ణ, విజయ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి,నవీన్, మంజునాథ్, శ్రీనాథ్‌రెడ్డి, రఫీ, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్‌ను కలసిన మాజీ సర్పంచ్

**రామకుప్పం, జులై 12 ప్రభాతవార్త :** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉన్సిగానిపల్లి మాజీ సర్పంచ్ జయశంకర్ అమరావతిలో కలిశారు. ఈసందర్భంగా తమ కుటుంబంపై గత ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని తమపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని మంత్రి లోకేష్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు.

## మంచి నీటి బోరుని రిపేరు చేయాలి



**పాకాల, జులై 12 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ధర్మరాజుల గుడి వీధి, పొగతోట చుట్టు పక్కల శుక్రవారం డయేరియా స్పెషల్ డ్రైవ్ పంచాయితీ సానిటరీ అధికారులు, ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా వున్న ప్రజలు ధర్మరాజుల గుడి వీధిలో ట్రెజరీ అనుకొని ఉన్న మంచినీటి చేతి బోరు పంపు గత కొంత కాలంగా పనిచేయడం లేదని స్థానిక మచ్చా దొరస్వామి నాయుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా అధికారులు వెంటనే స్పందించి మంచినీటి చేతి బోరు పంపు చుట్టుపక్కల క్లీన్ చేయించి వీలైనంత తొందరగా స్థానిక ప్రజలకు అందుబాటులోకి స్థానిక టిడిపి నేత రావిళ్ళ మోహన్ తీసుకువస్తామన్నారు.

## మహిళా సాధికారతతోనే అభివృద్ధి : ఎంపీ

**బంగారుపాళ్యం, జులై 12 ప్రభాతవార్త:** మహిళ సాధికారితతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీ దగ్గమళ్ళ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం రోప్స్ సంస్థ ప్రత్యేక అవసరాల పిల్లలకు వీల్‌ఛైర్ సైకిళ్ళను పంపిణీ చేసింది. ఈ పంపిణీ ముఖ్య అతిధిగా హాజరైన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి మహిళ చదువుకుంటే అన్ని విధాల అభివృద్ధి సాధించవచ్చు నన్నారు. దేశ జనాభాలో సగ భాగం వున్న మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు సాధించడానికి మహిళలు కలసికట్టుగా పోరాటం చేయాలన్నారు. రోప్స్ సంస్థ విద్య, సామాజిక సేవ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్, కార్యదర్శి జనార్ధన్, చిత్తూరు జిల్లా టిటిపి అధ్యక్ష కార్యదర్శులు, సిఆర్ రాజన్, కోదండయాదవ్, రోప్స్ సంస్థ ఛైర్మన్ ధనశేఖర్, సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, టిడిపి నాయకులు కోకా ప్రకాష్‌నాయుడు, కమలనాధరెడ్డి, ఎన్‌పి ధరణి, లోకనాధనా యుడు, హేమచంద్ర, శివ, జాకీర్, ఎంపిడిఓ శివశంకర్, తహసిల్దారు సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తి మృతి!

**బంగారుపాళ్యం, జులై 12 ప్రభాతవార్త:** చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మధుకుమార్(35) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంకు చెందిన మధుకుమార్ అతని బావమరిది భరత్‌కుమార్, మరో వ్యక్తి నాగరాజు ద్విచక్రవాహనంలో తిరుపతి జిల్లా సూళ్ళూరుపేటకు ద్విచక్రవాహనంలో వెళ్ళారు. తిరిగి ద్విచక్రవాహనంలో వాల్మీకిపురంకు వెళ్తుండగా మొగిలి ఘాట్ వద్ద రహదారికి అడ్డంగా అడవి పందులు రావడంతో వాటిని తప్పించబోయి బోల్తా పడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన మధుకుమార్,నాగరాజులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు మధుకుమార్ శుక్రవారం మృతి చెందాడు.ఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

**తవణంపల్లె, జులై 12 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బంగారుపాళ్యం సమితి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కేంద్రం చిత్తూరు ఎన్‌జీఓ హోంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ఈఎన్నికలు జరిగాయి. ఈమేరకు సంఘం బంగారుపాళ్యం సమితి అధ్యక్షుడిగా డి.రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా టి.సుబ్ర మణ్యంరెడ్డి,కార్యదర్శిగా విఆర్ సతీస్‌కుమార్, కార్యవర్గ సభ్యుడిగా మహబూబ్ బాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంను పలువురు అబినందించారు.

## నాసా పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

**పుత్తూరు రూరల్, జులై 12 ప్రభాతవార్త:** మండలంలోని పరమేశ్వర మంగళం శ్రీచైత్య విద్యార్థులు ఇటీవల నిర్వహించిన నాసా స్పేస్ సెటిల్‌మెంట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.గోపీ తెలిపారు. ఈపోటీల్లో కళాశాలకు చెందిన 51 మంది విద్యార్థులు పాల్గొని ప్రాజెక్టులు సబ్మిట్ చేయడం జరిగిందన్నారు. అందులో 10 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతులను సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా కళాశాల ఏజీఎం సురేష్ చేతుల మీదుగా అభినందన పత్రాలు, బంగారు పతకాలు, మెమెంటోలను అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శరవణ, కో-ఆర్డినేట్ బాలాజీ, ఏఓ విజయ్, సీ.బ్యాచ్ ఇన్‌చార్జి వినోద్, నాసా ఇన్‌చార్జి జి,రోజారిణి,దివాకర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ పన్ను బకాయిలు సత్వరం చెల్లింపు

**- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశం**

**చిత్తూరు రూరల్, జులై 12 ప్రభాతవార్త:** జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీలు, పంచాయతీల నుండి గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయిలను సత్వరం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీలు, పంచాయతీలు తాము వసూలు చేసిన ఆస్తిపన్నులో 8 శాతం జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లిచాల్సి వుంటుందన్నారు. 2007-08 నుండి 2023-24 సంవత్సరం వరకు ఈ బకాయిలు చెల్లిం చలేదని, బకాయిలు చెల్లించి గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పాడాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, జిల్లా ఆడిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, పుంగనూరు, నగరి, పలమనేరు మున్సిపల్ కమీషనర్లు నరసింహ, ప్రసాద్, వెంకటరామిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కడ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వికాస్ మర్మత్ బాధ్యతలు



**కుప్పం, జులై 12 ప్రభాతవార్త :** కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులైన ఐఎఎస్ అధికారి వికాస్ మర్మత్ శుక్రవారం చిత్తూరు కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సమక్షంలో బాధ్యతలుచేపట్టారు.కలెక్టరునుకలిశారు. అనంతరం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును కలిశారు. ఈసందర్భంగా డిఆర్వో పుల్లయ్య కడ పిడి వికాస్ మర్మత్‌కు స్వాగతం పలికారు.

## ఆటోనగర్ ఏర్పాటుకై జోనల్ మేనేజర్‌చే స్థల పరిశీలన



**కుప్పంరూరల్, జులై 12 ప్రభాతవార్త :** కుప్పంలో కార్మికుల కోసం ఆటో నగర్ ఏర్పాటు కోసం శుక్రవారం ఎపిఐఐసి జోనల్ మేనేజర్ స్థలాలను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో ఉన్న త ంబిగానిపల్లి, మోడల్ కాలనీ ప్రాంతంల్లో ఆయన స్థలాలను పరిశీలించారు. ఈసందర్భంగా మున్సిపల టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ గతంలోనే సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో ఆటోనగర్ ఏర్పాటుకు హామీ ఇచ్చి స్థలాల పరిశీలన సైతం చేయించారన్నారు. ఈ నేపథ్యంలో ఆటోనగర్‌ను కనీసం పది ఎకరాల్లో ఏర్పాటుచేసేలా చూడాలని ఆయన జోనల్ మేనేజర్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందించి స్థలాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని సాధ్యమైనంత త్వరగా ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.నేతలు డికెపల్లి మణి, నబీఉల్లా, మునాఫ్, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



**కుప్పంరూరల్, జులై 12 ప్రభాతవార్త :** మండలంలోని వెండుగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు రమేష్, పార్థ, రామచంద్ర, అశోక్, మురుగేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టు పెంపకంతో అధిక లాభాలు

**వెదురుకుప్పం, జులై 12 ప్రభాతవార్త :** పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు వస్తాయని రైతులు అవగాహనతో ముందుకు వెళ్ళాలని మల్బరీ శాస్త్రవేత్త కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పెరుమాళ్ళపల్లె రైతు సేవా కేంద్రం నందు పట్టు పరిశ్రమ రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన తవారుత తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, రాబడి పొందవచ్చన్నారు. పట్టు పరిశ్రమను అభివృద్ధి పరచడం కొరకు ప్రభుత్వం రాయితీ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్బరీ శాస్త్రవేత్త మల్లికార్జున్,సిరికల్చర్ జాయింట్ డైరెక్టర్ శోభారాణి, ఏడి మోహన్, సర్పంచ్ బండి శశిఆనంద రెడ్డి, ఎంపిటిసి హరి, ఎస్‌వో గణేష్, ఏఎప్‌వో ఈశ్వర్ రెడ్డి, విఏఏ దయాకర్, విహెచ్ఏ చెంగమ్మ, పెద్ద సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వసంతిని హత్యచేసిన వారిని ఉరితీయాలి



**చౌడేపల్లి, జులై 12 ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మంచిమర్రికి చెందిన చిన్నారి వసంతి (9)హత్యకు కారకులైనవారిని వెంటనే ఉరితీయాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు ఆది డిమాండ్ చేసాడు. వసంతి హత్యకు నిరసిస్తూ చిన్నారి ఆత్మశాంతి కోసం ఆసంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు నందు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. రెడ్డిప్రసాద్, వెంకట్రమణ, సూర్యనారాయణ, పాల్గొన్నారు.

## పరిమితి మించి విద్యార్థులను తీసుకొని రాకూడదు : ఎంఈఓ

**పాకాల, జులై 12 ప్రభాతవార్త :** ప్రైవేట్ పాఠశాలలు వారు నడిపే బస్సులలో పరిమితి మించి విద్యార్థులను తీసుకొని రాకూడదని తిరుపతి జిల్లా పాకాల మండల విద్యా శాఖాధికారి బాబ్జి అన్నారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నడిపే వాహనాలలో ఎన్ని సీట్లు ఉన్నాయో అంత మంది విద్యార్థులను మాత్రమే ఎక్కించుకుని పాఠశాలకు భద్రంగా తీసుకొని చేర్చాలని అన్నారు.ఎంఈఓ 2 లింగయ్య, ఆయా ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## తల్లికి వందనం.. శ్రీకారం

**కోట, జులై 12 ప్రభాతవార్త :**

తల్లికి వందనం హామీని రాష్ట్రప్రభుత్వం అమలు చేయనుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులకు తల్లికి వందనం పేరిట ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇకపై అందిస్తారు. వైసీపీ హయాంలో అమ్మఒడి పేరిట పథకాన్ని ఎన్డీఏ ప్రభుత్వం తల్లికి వందనంగా పేరు మార్చిన విషయం తెలిసిందే. బియ్యం కార్డు కలిగిన కుటుంబాల విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. నగదును తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా జీవోతో పాటు మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఎంఇఓ మసానతనయ్య చెప్పారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 1 నుంచి 12వ తరగతి చదువుతున్న వారికి ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. విద్యార్థులకు ఆధార్‌కార్డు ఉండాలని ఒకవేళ లేకపోతే ప్రభుత్వం జారీ చేసిన 10 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉండాలన్నారు. ఏడాది మొత్తంమీద 75 శాతం హాజరు ఉండాలని స్పష్టం చేశారు.

## పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు సేవలందించాలి : ఎమ్మెల్యే

**వెంకటగిరి, జులై 12 ప్రభాతవార్త :**



నిమ్మ పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు విరివిగా సేవలు అందించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శాస్త్రవేత్తలకు సూచించారు. వెంకటగిరి మండలం పెట్లూరు వద్ద ఉన్న నిమ్మ పరిశోధన కేంద్రాన్ని ఎమ్మెల్యే రామకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. నిమ్మ పరిశోధన కేంద్రం భవనాన్ని, నిమ్మ మొక్కలని పరిశీలించారు. పరిశోధన కేంద్రంకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి సీనియర్ శాస్త్రవేత్త మధుమతి వివరించారు. మన దురదృష్టం ఏమిటంటే గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న 5 సంవత్సరాలలో ఒక్క రూపాయి కూడా అభివృద్ధికి గాని, కనీస మౌలిక వసతులకుకూడాఇవ్వకపోవడటంరైతులమీదఇతనికిఎంతమాత్రం ప్రేమ, వ్యవసా యం మీదఇతనికి ఎంతఅవగాహనఉందోఅర్థమవుతుంది.ఎమ్మెల్యేవెంటమాజీ ఏఎంసి చైర్మన్ సిసి నాయుడు ఉన్నారు.

## కాలువల్లో పూడికతీస్తున్న మున్సిపల్ అధికారులు

**వెంకటగిరి, జులై 12 ప్రభాతవార్త :**



ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల కారణంగా వెంకటగిరి మున్సిపాలిటీ 14వ వార్డు పరిధిలోని ధర్మపురం కాలువ నందు నరసింహారావు వీధి కాలనీ నందు అదే విధంగా బ్రిడ్జి నందు ఉన్న కాలువ నందు అదే విధంగా బ్రిడ్జి నందు ఉన్న కాలువ నందు చెత్తా చెదారం పేరుకుపోయి ఉన్నందున వాటిని జేసిబి ద్వారా శుభ్రపరుస్తున్నారు. ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని పరిష్కార దిశగా చర్యలకు ఆదేశాలించిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకి మున్సిపల్ కమిషనర్‌కి సానిటరీ ఇన్స్పెక్టర్‌కి, సచివాలయం శానిటరీ సెక్రటరీకి కృతజ్ఞతలు తెలిపారు.

## జీవన ఎరువులచే భూములు సారవంతమవుతాయి

**వెంకటగిరి, జులై 12 ప్రభాతవార్త :**



జీవన ఎరువుల వినియోగం ద్వారా భూములు సారవంతమవుతాయని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బిజి రాజులు తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం నందు రైతులకు జీవన ఎరువులు, జీవ నియంత్రణ కారకాలు ప్రాముఖ్యత, వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి బి. గోవిందరాజులు జీవన ఎరువులు, జీవ నియంత్రణ కారకాల ద్వారా నేల సారం పెరగడమే కాకుండా నేల ద్వారా వ్యాపించే తెగుళ్లు కూడా వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటలలో తగ్గించవచ్చు అని తెలిపారు. రైతులకు జీవన ఎరువులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా. పి. నాగార్జున రెడ్డి, డా. డి. తిరుపాల్, రైతులు పాల్గొన్నారు.

## ఐఐఐటికి దట్టం బినిత శ్రీ ఎంపిక



**చిల్లకూరు, జులై 12 ప్రభాతవార్త :** చింతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన దట్టం బినిత శ్రీకి 566 మార్కులు పొందడంతో ఆర్‌జియుకెటి నందు ఇడుపులపాయలో ఐఐఐటి సీటు పొందారు. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఐఐఐటిలో సీటు వచ్చినందుకు విద్యార్థిని తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేసారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు రావు

**బాలాయపల్లి, జులై 12 ప్రభాతవార్త :**



వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని బాలాయపల్లి ఈవోపిఆర్డి శ్రీనివాసులు కోరారు. మండల కేంద్రమైన బాలాయపల్లి గిరిజన కాలనీలో ఆయన క్లోరినేషన్ చేపట్టారు. అబెడ్ అనే ద్రావకాన్ని పిచికారి చేసారు. గ్రామంలో పలు చోట్ల పర్యటించి అపరిశుభ్రంగా ఉన్న పలు ప్రదేశాల్లో క్లోరినేషన్ చేయించారు. నివాసాలలో టైర్లు, రోళ్ళు, పాత్రలలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ శానిటేషన్ కార్యక్రమంలో పంచాయితీ అధికారిణి లీలావతి, ఏఎన్ఎం ప్రసన్న, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ కోత

**వెంకటగిరి, జులై 12 ప్రభాతవార్త :**

పట్టణంలోని 132 కెవి సబ్ స్టేషన్‌లో రెండవ శనివారం మరమ్మత్తుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వెంకటగిరి టౌన్, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెంకటగిరి విద్యుత్ శాఖ డీఈఈ ముని రవిచంద్ర తెలిపారు. రైతులు వినియోగదారులు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## ఆదిశంకర ఇంజనీరింగ్ కళశాలకు అటానమస్ పెంపు

**గూడూరు, జులై 12 ప్రభాతవార్త :**



గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా మరో 10 సంవత్సరాలు పొడిగించడం జరిగిందని త్వరలో కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామని కళాశాల చైర్మన్ వంకీ పెంచలయ్య తెలిపారు. గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వంకీ పెంచలయ్య మాట్లాడుతూ ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలకు 10 సంవత్సరాలు క్రిందట ఆటానమస్ హోదా వచ్చిందని మరల ఆ హోదాను మరో పది సంవత్సరాలు పొడిగిస్తూ ఉన్నత విద్యా మండలి సర్టిఫికేట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆదిశంకర కళాశాలను డీమ్డ్ యూనివర్శిటీగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపించామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏవో రామయ్య పాల్గొన్నారు.

## పరిష్కరించుకోవాల్సిన సమస్యలపై సమావేశం

**వాకాడు, జులై 12 ప్రభాతవార్త :**



ఎన్ఎంయు కార్మికుల సమస్యలపై పరిష్కరించుకోవాలల్సిన అవసరం వచ్చిందని ఏపీఎస్ఆర్‌టిసి రీజినల్ కార్యదర్శి బిఎస్ బాబు అన్నారు. శుక్రవారం వాకాడు ఇరిగేషన్ అతిధి గృహంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వాకాడు డిపో ఎన్ఎంయు డ్రైవర్లు కండక్టర్లు కార్మికులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి సభాధ్యక్షులుగా పి. చంద్రయ్య ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యంగా వాకాడు డిపోలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కూడా కలిసి డిపోలో ఉన్నటువంటి సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు.రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య నెల్లూరు ఉమ్మడి జోనల్ అధ్యక్షులు డివిఆర్ కుమార్, జిల్లా అధ్యక్షులు ఎస్‌జె పెరుమాళ్, జిల్లా ఉపాధ్యక్షులు గుణశేఖర్, కె. సుధాకర్ రావు, రీజనల్ అసిస్టెంట్ సెక్రెటరీ ఆర్ముగం, జిల్లా జాయింట్ సెక్రెటరీ సురేష్, భాస్కరయ్య,రఘురామయ్య,సుబ్రమణ్యం గ్యారేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాకాడు డిపో నాయకులు రీజినల్ నాయకులకు పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ముగ్గురు బాలికలు

**తడ, జులై 12 ప్రభాతవార్త :**







తడ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. వీరిలో ఇద్దరు కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలోను, మరొకరు ఒంగోలులోను సీట్లు సాధించినట్లు ఎంఇఓ మల్లికార్జునరావు తెలిపారు. గత 10వ తరగతి ఫలితాలలోనే వీరు ప్రతిభ చూపించారు. ప్రస్తుతం బి.వెంకటకీర్తి, బి.ధనుశ్రీలు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని, వీరిద్దరూ స్వయంగా అక్కాచెల్లెళ్లని ఎంఇఓ చెప్పారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఆర్.శాలిని ఎంపికయింది. వీరిని మండల విద్యాశాఖ అధికారులు జి.సరస్వతి, కె.మల్లికార్జునరావుతో పాటు ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు!

**దొరవారిసత్రం జులై 12 ప్రభాతవార్త ;**

మండలంలోని నెలబల్లి సమీపంలో జాతీయరహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.సేకరించిన సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేటకు చెందిన రమేష్,అశోక్‌కుమార్‌లు మోటార్‌సైకిల్‌పై సూళ్ళూరుపేటకు వెళుతుండగా మార్గమధ్యలో దొరవారిసత్రం మండలం నెలబల్లి వద్దకు వచ్చేసరికి వెనుక నుండి అదేమార్గంలో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్‌ను ఢీకొంది.దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న రమేష్, అశోక్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు.పక్కనే ఉన్న స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరళించారు.దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రాథమిక విద్యావ్యవస్థను కాపాడాలి

**నాయుడుపేట, జులై 12 ప్రభాతవార్త :**



రాష్ట్రప్రభుత్వం జీఓ నంబర్ 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యా వ్యవస్థను కాపాడాలని బిటిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ అన్నారు. శుక్రవారం ఓజిలి మండలంలో జరిగిన బిటిఎ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగింపు సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం జీఓ నంబర్ 117ను రద్దు చేసి 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. బిటిఎ రాష్ట్ర అదనపు కార్యదర్శి పేర్నాటి రామకృష్ణ మాట్లాడుతూ బిటిఎ బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడానికి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తుందని తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జెడ్డా వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించి బోధనపై దృష్టిపెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిటిఎ రాష్ట్ర కార్యదర్శి బిసి చెంచయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చక్రవర్తి, ఓజిలి మండల బిటిఎ అధ్యక్షులు కుమార్, ప్రధాన కార్యదర్శి పుట్టమనేని శేఖర్, గోను సుధాకర్, జి.సుబ్బయ్య, రవీంద్ర, డివి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలి

**ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం**

**గూడూరు, జులై 12, ప్రభాతవార్త**



ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద హెల్మెట్ పై, మోటార్ వెహికల్ చట్టాల పై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత అధిక వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాల భారిన పడి, ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ సంఘటనలు నిత్యం చూస్తున్నామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రుల పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి లోకనాథం, బ్రేక్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ రావు, లీగల్ అడ్వైజర్లు కోటేశ్వర రావు, ఖాధర్ భాష, ఒకటవ పట్టణ సిఐ పాపా రావు, ఎస్ఐ శ్రీహరి బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**గూడూరు, జులై 12, ప్రభాతవార్త**

గూడూరు మండల పరిధిలోని వేముల పాలెం వద్ద అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను రూరల్ పోలీస్‌లు పట్టుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఈదలపల్లి నుండి గాంధీ నగర్‌కు ఆటోలో 420 కేజీల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు పట్టుకొని, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యంను నిల్వ చేసినా, విక్రయించిన చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

## రైతు సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్

**గూడూరు, జులై 12, ప్రభాతవార్త**

గూడూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో మండల రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు గూడూరు సహాయ వ్యవసాయ అధికారి వి. రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గోపీ నాయక్ మాట్లాడుతూ 129 మంది రైతులను అర్హులుగా గుర్తించి నమోదు చేయడం జరిగింది. ముఖ్యంగా లాండ్‌లింకేజ్, ఈకెవైసి రైతు అందుబాటులో లేకపోవడం వంటి రకరకాల కారణాలతో పిఎం కిసాన్ సమ్మాన్ నిధి ఆగిపోవడం జరిగిందన్నారు. ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి వారికి లబ్ధి చేకూరేలా చేయడం వలన రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

## కేంద్రహోంశాఖ మంత్రికి ఘనంగా వీడ్కోలు



**శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త :** తిరుమలేశుని దర్శించుకున్న భారతీయ జనతా పార్టీ తెలంగాణా రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కరీంనగర్ ఎంపి కేంద్రహోంశాఖ మంత్రి బండిసంజయ్‌ను బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. వీడ్కోలు పలికిన వారిలో జిల్లా కార్యదర్శి అసెంబ్లీ కో కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్వీరమణ, బీడిబాలాజీ, కొండేటి గోపాల్‌లతో పాటు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏను సత్కరించిన ఉపాధ్యాయులు



**తొట్టంబేడు, జూలై 12 ప్రభాతవార్త :** ఎంఎల్‌ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డికి శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు అందరు కలసి సత్కరించారు. ఎంఎల్‌ఏను సత్కరించిన వారిలో ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప, కృష్ణయ్య, లక్ష్మయ్య, బృందాదేవి, శ్రీదేవి, కోమలాదేవి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం జయసుధ, పన్నీరుచలం, మునితిరుమలయ్య, రాజకుమారి ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త :

నేడు రెండో శనివారం సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి 132కెవి సబ్‌స్టేషన్ పరిధిలో గల 33కెవి సబ్‌స్టేషన్ల నందు, 11కెవి లైన్లు మరియు ట్రాన్స్‌ఫార్మర్లు నెలవారీ మరమ్మత్తులు నిర్వహణనిమిత్తం విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. శ్రీకాళహస్తిటౌన్, రూరల్, తొట్టంబేడు, బిఎన్‌కండ్రిగ, ఏర్పేడు, మరియు కెవిబిపురం మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## బాలుర జూనియర్ కళాశాలకు విరాళం

తొట్టంబేడు, జూలై 12 ప్రభాతవార్త :



ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు ఎంజిఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ శుక్రవారం రూ.30వేలు విరాళాన్ని ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డికి చెక్కు రూపంలో అందించారు. ఈ నిధులతో కళాశాల గేటుముందు పశువులు ప్రవేశించకుండా క్యాటిల్‌గాడ్‌ని ఏర్పర చనున్నారు. బొజ్జలబృందమ్మ సూచనల మేరకు ఎంజిఎం గ్రూప్స్ డైరెక్టర్ మల్లికార్జున్‌నాయుడు స్టోన్‌క్రషర్ యజమానులతో మాట్లాడి టిప్పర్లతో సుమారు రూ.10లక్షలు విలువగల క్రషర్లు వద్ద ఉన్న వేస్టేజితో కళాశాల ప్రాంగణాన్ని చదును చేయించారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్మరాజుల స్వామి ఆలయం వద్దకు అర్జున విగ్రహాలు



**శ్రీకాళహస్తి,.జూలై 12 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ధర్మరాజుల స్వామి ఆలయంలో తిరునాళ్ళు సందర్భంగా 12 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు అర్జున,శ్రీకృష్ణ,ద్రౌపదీ దేవి విగ్రహాలకు ఆలయంలోని నాయనార్ల విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయాధికారులు లక్ష్మయ్య, వెంకటస్వామి వారి సహచరులు, ధర్మరాజుల స్వామి ఆలయ పూజారులు వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా సాగింది.

## మహిళా వర్సిటీలో లోటస్ డిజైనర్ ఫ్యాషన్ షో

తిరుపతి విద్య, జూలై 12 ప్రభాతవార్త :



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని బి ఒకేషనల్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థినిలు వారి ఫైనల్ ఇయర్ ప్రాజెక్టులో భాగంగా వారు డిజైన్ చేసినటువంటి దుస్తులను మోడల్స్‌కు వేసి లోటస్ డిజైనర్ ఫ్యాషన్ షోలో ప్రదర్శన చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్లు ప్రొఫెసర్ డి. భారతి, రిజిస్టర్ ప్రొఫెసర్ ఎన్. రజని, హోమో సైన్స్ ఆ విభాగాధిపతి డాక్టర్ బిందు, దేవి హబీబ్, ఫ్యాషన్ టెక్నాలజ విద్యార్థినిలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్కిడ్ హోటల్, తిరుపతి, వరగానీ స్టూడియోస్, బ్లెస్స్ డిజైనర్ స్టూడియోస్, లేఖ పింక్ పాలెట్ వారు స్పాన్సర్స్‌గా వ్యవహరించడం జరిగింది.

## మంగల్దీప్ కాంపయిన్ ప్రారంభం

తిరుపతి విద్య, జూలై 12 ప్రభాతవార్త :

భారతదేశపు ప్రీమియర్ అగరబత్తి బ్రాండ్ ఐటిసి మంగల్దీప్ తమ కొత్త, దిల్ సే కరో బాత్, భగవాన్ కే సాథ్ కాంపైన్‌ను ప్రారంభించినట్లు ఐటీసీ, మ్యాచెస్, అగరబత్తి బిజినెస్ (ఎంఎబి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ గౌరవ తయాల్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కాంపైన్‌ను లక్ష్యభరితమైన ప్రేక్షకుల వద్దకు తీసుకువెళ్లడానికి, ఓగిల్వి ఇండియా ద్వారా చిత్రీకరించబడిన కొత్త యాడ్‌ను ఐటిసి మంగల్దీప్ విడుదల చేసిందన్నారు. మంగళదీప్ ప్రతి ఒక్కరు ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో ఓగిల్వి ఇండియాల్ గ్రూప్ క్రియేటివ్ డైరెక్టర్ రాజేష్, మణి, తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణి మెడికల్ ఏజెన్సీలో షార్ట్ సర్క్యూట్

దాదాపుగా 50 లక్షల పైగా ఆస్తి నష్టం

తిరుపతి హెల్త్, జూలై 12 ప్రభాతవార్త:



తిరుపతి నగరంలోని కోట కొమ్మల వీధి త్రివేణీ మెడికల్ ఎంటర్ప్రైజెస్ ఏజెన్సీ నందు శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు పక్కనున్న ట్రాన్స్ఫర్మర్ పేలడంతో త్రివేణి మెడికల్ ఏజెన్సీలో షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో మెడికల్ ఏజెన్సీలో ఉన్న ప్రమాదం సంభవించింది. దీంతో మెడికల్ ఏజెన్సీలో ఉన్న ఫర్నిచర్స్, మెడిసిన్స్, కంప్యూటర్స్, లాకర్‌లో ఉన్న 5 లక్షల రూపాయిల కలెక్షన్ డబ్బులు కాలి బూడిదైనాయి. దీంతోదాదాపుగా 50 లక్షల రూపాయిలు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రొప్రైటర్ శివకుమార్ తెలిపారు.

## చంద్రగిరి పంచాయతీలో ఫిర్యాదులపై విచారణ

చంద్రగిరి, జూలై 12 ప్రభాతవార్త:



చంద్రగిరి మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు వెళ్లడంతో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశిస్తూ గూడూరు డిఎల్‌పిఓ వెంకటరమణ, చంద్రగిరి ఈఓఆర్‌డి శశిరేఖను కమిటీగా వేశారు. ఈ క్రమంలో శుక్రవారం చంద్రగిరి పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న కమిటీ ఈఓ మహేశ్వరయ్యను విచారణ చేశారు. పంచాయతీలో నిధుల వ్యయ నిర్వహణ, బిల్లుల చెల్లింపులకు సంబంధించిన రికార్డులను ఈఓ కమిటీకి అందజేశారు. రికార్డులను పూర్తి స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు కమిటీ అధికారులు వెల్లడించారు.

## ఉపాధిహామీలో అవినీతిని నియంత్రించండి..!

రామచంద్రాపురం, జూలై 12 ప్రభాతవార్త:



ఉపాధిహామీ పనుల్లో అవినీతిని నియంత్రించడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని బిజెపి జిల్లా కార్యదర్శి కాయం హరినాథ్ రెడ్డి శుక్రవారం కేంద్ర హోమ్‌శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కోరారు. ఎన్ఆర్ఈజిఎస్‌లో భారీ ఎత్తున నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. క్షేత్ర స్థాయిలో అక్రమాలపై మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి అక్రమాలను అరికట్టాలని కోరారు. ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

## శ్రీలక్ష్మీదేవి అలంకరణలో వారాహీ అమ్మవారు

రామచంద్రాపురం, జూలై 12 ప్రభాతవార్త:



రాయలచెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో వారాహీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. జగద్గురువులు సిద్దేశ్వరనంద మహాభారతి స్వామి వారి దివ్యాశీస్సులతో శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి వివిధ సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పట్టువస్త్రాలు వివిధ రకాల సుంగంధభరిత పుష్పాలతో శ్రీలక్ష్మీ వారాహిదేవిగా అలంకరించి దర్బారు సేవ నిర్వహించారు. మహిళలు సుహాసినీ పూజలు చేశారు. భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. పీఠం ప్రాంగణంలో సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

## బాబు హెల్మెట్లు పెట్టుకోండయ్యా : ఎస్ఐ



**రేణిగుంట, జూలై 12 ప్రభాతవార్త:** బాబు హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహనాలు నడపండయ్యా అంటూ రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పట్టణం నందలి అంబేద్కర్ సర్కిల్ వద్ద జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ సూచనలతో అర్బన్ సీఐ మల్లికార్జున్ పర్యవేక్షణలో ద్విచక్రవాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పని సరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. హెల్మెట్లు లేకుండా వాహనాలు నడపడం వల్ల ఎంతో మంది మరణిస్తున్నారన్నారు. హెల్మెట్లు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయం కాకుండా కాపాడుతుందని, కాబట్టి వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్లను వినియోగించాలని కోరారు. హెల్మెట్లు ధరించకపోతే ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఫైన్లు వేయడమే కాకుండా కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

రేణిగుంట, తిరుపతి జూలై 12 ప్రభాతవార్త:



తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 18 మంది పట్టుబడినట్లు డీఎస్పీ రమణ కుమార్ తెలిపారు. వీరిని కోర్టులో ప్రవేశపెట్టగా 18 మందికి నాలుగో అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున 18 మందికి 1,80,000 రూపాయల జరిమానా విధించారని, మరో ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు ఆయన తెలిపారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తూ రోడ్డు పక్కన నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేసుకుంటున్న 62 మందికి స్పెసల్ కోర్టు ఇన్‌చార్జి మూడవ అదనపు జ్యూడీషియల్ సివిల్ జడ్జి ఒక్కొక్కరికి 500 రూపాయలు వంతున అందరికి కలిపి 31,000 రూపాయలు జరిమానా విధించారన్నారు. ట్రాఫిక్ పోలీసుల పని తీరును జిల్లా ఎస్పీ అభినందించినట్టు తెలిపారు.

## ఈ బాలుడిని గుర్తించండి

రేణిగుంట, జూలై 12 ప్రభాతవార్త:



రేణిగుంట రైల్వే పోలీస్‌స్టేషన్‌లో నాలుగు సంవత్సరాల బాలుడు పోలీసుల సంరక్షణలో ఉన్నాడని ఈ బాలుడిని గుర్తించిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. రేణిగుంట రైల్వేస్టేషన్ మూడో నెంబర్ ప్లాట్‌ఫాంపై ఓ బాలుడు ఒంటరిగా తిరుగుతుండగా ప్లాట్‌ఫారంపై ఉన్న వారు బాలుడిని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే ఎస్ఐ 9963126343 మొబైల్ నెంబర్‌కు తెలియజేయాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి!

చంద్రగిరి, జూలై 12 ప్రభాతవార్త:



పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి ఎం.కొంగరవారిపల్లి వద్ద శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపడగా బాలు (26) మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు.. మదనపల్లి మండలం, రెడ్డివారిపల్లికి చెందిన వాసు, అన్నయ్య బాలు, అమ్మ శంకరమ్మ, బంధువు ప్రియాంక, స్నేహితుడు దిలీప్ బెంగుళూరు నుండి తూర్పుగోదావరి జిల్లా, భీమవరంకు వెళ్ళి తిరుగు ప్రయాణంలో ఎం.కొగరవారిపల్లి వద్ద ఆవు కారుకు అడ్డురావడంతో అదుపుతప్పిన కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలు తలకు తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు, శంకరమ్మ, దిలీప్ తీవ్రగాయాలపాలయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మృతి!

రామచంద్రాపురం, జూలై 12 ప్రభాతవార్త:



నెత్తకుప్పం - రాయలచెరువు ప్రధాన రహదారి నెత్తకుప్పం జగనన్న కాలనీ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాలలో వెనుక కూర్చున్న నెమళ్ళ గుంట పల్లికి చెంగారెడ్డి (46), చిత్తూరుకు చెందిన భరత్ (36) మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు.. పచ్చికపల్లం నుండి వ్యక్తిగత పనులు ముగించుకుని స్వగ్రామం నెమళ్ళగుంట పల్లికి చెంగారెడ్డి సమీప బంధువు గోవర్ధన్ ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చుని వస్తుండగా, నెత్తకుప్పం నుండి తిమ్మరాజుపల్లి వైపు వెళుతున్న దేవరాజులు ద్విక్రహనం ఢీకొనడంతో దేవరాజులు వెనుక కూర్చుని వున్న భరత్ మృతి చెందారు. చెంగారెడ్డిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అదేవిధంగా భరత్ ఎన్ఆర్ కమ్మపల్లిలోని తన బంధువుల ఇంటి వద్ద వెళ్ళి ఆసుపత్రికి బయలుదేరుతుండగా తలకు గాయాలు కావడంతో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గుర్తు తెలియని వ్యక్తి రైలు క్రిందపడి మృతి

**చంద్రగిరి, జూలై 12 ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి రైలు క్రిందపడి మృతి చెందిన ఘటన శుక్రవారం కల్‌రోడ్‌పల్లి సమీపంలో చోటుచేసుకున్నది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. గుర్తు తెలియని వృద్ధుడు (60) కల్‌రోడ్‌పల్లి వద్ద రైల్వే ట్రాక్‌పై మృతి చెందినట్లు సమాచారం అందడంతో సంఘటనా స్థలికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. మృతుడి దేహం రెండు ముక్కలు కాగా, మృతుడు నలుపు ప్యాంట్, తెలుపు ఫుల్ షర్టు ధరించాడనీ, షర్టు కాలర్‌పై చరణ్‌తేజ్ పేరిట స్టిక్కర్ వున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకుందాం

-ఇద్దరు ఎంఎల్‌ఏల సమాలోచనలు

శ్రీకాళహస్తి రూరల్, జూలై 12 ప్రభాతవార్త :



రెండు చారిత్రాత్మక,ప్రసిద్ది చెందిన నియోజక వర్గాలకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, యువ నాయకుడు నారాలోకేష్‌తో చర్చించి ప్రత్యేక నిధులు సాధించి అభివృద్ధి చేసుకుందామని ఇద్దరు శాసనసభ్యులు శుక్రవారం ఊరందూరు గ్రామంలో చర్చించుకున్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఇంటికి చంద్రగిరి శాసన సభ్యుడు పులివర్తి నాని విచ్చేసారు. ఆయనకు గ్రామంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ ఎన్నికల తరువాత బొజ్జల కుటుంబాన్ని మర్యాద పూర్వకంగా పలకరించటానికి వచ్చానని వివరించారు. అయితే ఇద్దరు శాసనసభ్యులు చాలా సేపు ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు అప్పటి అధికార పార్టీలో తిరుగులేని నాయకులుగా పెత్తనం చెలాయించిన ఇద్దరిని జనం ఓడించి మనకు ఎనలేని మెజారిటి కల్పించారు. ప్రజలు రెండు నియోజకవర్గాల అభివృద్ధికి సంబంధించి ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే గత పాలకుల పాపాలతో పంచాయతీల్లో కాసుల్లేదు. అభివృద్ధి చేయాలంటే సర్పంచ్‌లను పనులు చేయమంటే నిధుల్లేకుండా అల్లాడుతున్నారు. కాబట్టి నియోజకవర్గాల అభివృద్ధికి సంబంధించి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు,నారాలోకేష్‌ల దృష్టికి తెద్దామని చర్చించుకున్నారు. చంద్రగిరి ఏమో చారిత్రాత్మక కోట కల్గి ఉంది. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్యాత్మిక నిలయం. రెండు ప్రాంతాల అభివృద్ధికి పర్యాటక కేంద్రం చేపట్టేటట్లు నిధులు సాధించాల్సి ఉందని ఇరువురు చర్చించుకున్నట్లు సమాచారం. పులివర్తినానికి స్వాగతం చెప్పిన వారిలో రిషితా రెడ్డి పలువురు మహిళా కార్యకర్తలు ఉన్నారు.

## ఎంఎల్‌ఏ గారూ...ఆలయ పనులు వేగవంతం చేయించండి : మాజీ ఛైర్మన్

శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త :



ఎంఎల్‌ఏ వెంకట సుధీర్‌రెడ్డి గారూ.. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన ఏడుగంగమ్మల ఆలయాన్ని గత ప్రభుత్వ హయాంలో శ్రీకాళహస్తీశ్వ రాలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్‌గా ఉన్న అంజూరు తారక శ్రీనివాసుల ఆధ్వర్యంలో మరమ్మత్తు పనులు చేపట్టారు. అయితే ప్రభుత్వం మారడంతో గంగమ్మ ఆలయ పనులు ఆగిపోయాయి. ఈనేపధ్యంలో రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా ఏడుగంగమ్మల జాతర జరగడం శ్రీకాళహస్తిలోనే. డిసెంబర్ మాసంలో జాతర నిర్వహిస్తారు. గత 50రోజులుగా పనులు ఆగిపోయి ఉన్నాయని నవంబర్‌లోపు కుంభాభిషేకం జరిపితే డిసెంబర్ 6 జాతర జరిగే వీలుటుందన్నారు. వర్షాకాలం కాబట్టి ముమమ్మరంగా పనులను వేగవంతం చేయాలని కుంభాభిషేకం జరగకపోతే జాతర నిలిపివేయాల్సి వస్తుందని, ఒకవేళ జాతర ఆగితే మూడేళ్ళ పాటు జాతరను జరగడానికి వీలులేదన్నారు. ఎంఎల్‌ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి వెంటనే స్పందించిఆలయపనులు సత్వరం పూర్తిచేయాలని మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : డిపిఓ

**తొట్టంబేడు, జూలై 12 ప్రభాతవార్త :** గ్రామాల్లో డయేరియా, డెంగీ, మలేరియా కేసులు పెరుగుతున్న దృష్ట్యా పంచాయతీ కార్యదర్శులు పారిశుద్యంపై ప్రధానంగా దృష్టిసారించాలని జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎంఎల్‌ఏ బొజ్జలసుధీదర్‌రెడ్డి సమీక్షలో పాల్గొన్న అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. పంచాయతీల్లోని 15వఫైనాన్స్ నిధులను వినియోగించు కోవాలని తెలిపారు. మండలంలోని గ్రామాల్లో పరిస్థితులపై ఆరాతీసి తగిన ఆదేశాలు ఇచ్చారు. ఓవర్‌హెడ్‌ట్యాంకులు క్లోరినేషన్ చేయాలని ఎక్కడైనా మంచినీటి లీకేజీలు ఉంటే వెంటనే గుర్తించి వాటిని మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడైనా మురుగునీరు నిల్వఉంటే వెంటనే తొలగించాలని కోరారు.

# తిరుపతి డివిజన్

## శ్రీవారి ఆశీస్సులందుకున్నాం



**తిరుమల,జులై 12ప్రభాతవార్త:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నామని ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విఐపి బ్రేక్‌దర్శనాలసమయంలోవెంకన్ననుదర్శించుకునితీర్థప్రసాదాలుఅందుకున్నారు

## అనధికార తట్టలు,ఆక్రమణలు ఉండనీయొద్దు : ఈఓ



**తిరుమల,జులై 12 ప్రభాతవార్త :** తిరుమలకొండపై భక్తులు ఆహ్లాదకర వాతావరణంలో షాపింగ్ చేసే విధంగా ఉండాలని, ఎక్కడా కూడా ఆక్రమణలు లేకుండా చూడాలని టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ అధికారులను టిటిడి ఈఓ జె.శ్యామలరావు ఆదేశించారు. భక్తులు సాఫీగా నడచివెళ్ళేలా, నడచి వచ్చేలా చూడటంలో ఆక్రమణలు ఎక్కడా ఉండకూడదన్నారు.

## ఉన్నతపదవుల్లో ప్రజా సేవ చేయాలి : జల్లి మధు



**తిరుపతిహెల్త్, జులై 12ప్రభాతవార్త:** బిజెపి ఓబిసి నేతగా జల్లిమధుసూదన్ ఉన్నత పదవుల్లో ప్రజా సేవచేయాలని, ప్రజల మధ్య పుట్టిన రోజులు జరుపుకోవాలని బిజెపి నేత గుండాల గోపీనాధరెడ్డి ఆకాంక్షించారు. జల్లిని కలసి దుశ్శాలువతో సన్మానించారు.

## స్టయిపండ్ పెంచాలని...పశు వైద్యవిద్యార్థులు ధర్నా



**తిరుపతి రూరల్, జులై 12 ప్రభాతవార్త:** విద్యార్థులకు ఇచ్చే స్టయిపండ్‌ను పెంచాలని డిమాండ్ చేస్తూ... పశువైద్య విద్యార్థులు ధర్నా చేపట్టారు. శుక్రవారం శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ విద్యార్థులు తరగతి గదులను బహిష్కరించి, పరిపాలన భవనం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో వైద్య విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జూనపూడి ఎజ్రా మాట్లాడుతూ పశు వైద్య విద్యార్థులకు గత 15 సంవత్సరాలుగా రూ,7వేల రుపాయాలను మాత్రమే స్టయిఫండ్‌గా ఇస్తున్నారని, తక్కువ స్టయిఫండ్ విద్యార్థుల అవసరాలకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. పశువైద్య విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ప్రతినెల రూ.15వేల రుపాయాలు విద్యార్థుల అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. అనంతరం విశ్వవిద్యాల రిజిస్ట్రార్‌కు వినతిపత్రాన్ని అందజేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సంఘం నాయకులు ఆకాష్, ఉపాధ్యాక్షుడు పవన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమం

-పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి -తుమ్మలగుంట టిడిపి అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి



**తిరుపతిరూరల్, జులై 12 ప్రభాతవార్త:** ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తుమ్మలగుంట టిడిపి అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం తుమ్మలగుంట గ్రామ పంచాయతి పరిధిలోని ఉప్పరపల్లిలో 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిరుదాల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మురుగు కాల్వలల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని, దోమల లార్వ పెరగకుండా మందులు పిచికారి చేయాలని పంచాయతి కార్యధర్శిని కోరారు. మురుగునీరు నిల్వ ఉండటం వల్ల ప్రమాదకరమైన డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం సభ ఏర్పాటు చేసి, రాబోయే వర్షాకాలంలో చేపట్టాల్సిన విధి విధానాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కేశవులు శెట్టి, సిద్దారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, వినోద్, సుబ్రమణ్యం,మనోహర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చెత్తబుట్టలు పంపిణీ



**వడమాలపేట, జులై 12 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వడమాలపేటలో శుక్రవారం ఇంటింటికి చెత్తబుట్టలు పంపిణీ చేశారు. చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి ధనంజయనాయుడు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెత్త బుట్టలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలేఖ, నాయకులు లక్ష్మిప్రసన్న, ఢిల్లీ ప్రసాద్, గురునాథశెట్టి, రాధాకృష్ణ, మురళీరెడ్డి, హేమాద్రినాయుడు, దాము యాదవ్, ఉమాపతి, సురేష్‌రాజు, జనసేన నాయకులు మునిశేఖర్, చక్రవర్తి, సచివాలయం సిబ్బంది గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 16న జాబ్‌మేళా

నగరి, జూలై 12 ప్రభాతవార్త: నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎంఆర్ఎఫ్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ మంగళవారం ఎంఆర్ఎఫ్ ట్రైనీ ఉద్యోగాల కొరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు 2019 నుంచి 2024 లోపు డిగ్రీ పూర్తి చేసి 20-26 సంవత్సరాల వరకు వయసు ఉన్న వారు అర్హులన్నారు. పూర్తి వివరాల కొరకు ఎంఆర్ఎఫ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.ఎస్.కన్నన్‌ను 9952970545 నెంబర్‌కు జేకేసీ ఫుల్‌టైం మెంటార్ ఆర్.లాల్‌బాషాను 9573104593 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**నగరి, జూలై 12 ప్రభాతవార్త:** పట్టణ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫోల్స్ నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాను శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

## ఆర్థిక మంత్రిని కలిసిన పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రతినిధులు



**విజయపురం, జూలై 12 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ నిధులు విడుదలకు కృషి చేసిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను శుక్రవారం అమరావతి సచివాలయంలో పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రతినిధులు పుష్పగుచ్ఛం, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రిగా కేశవ్ బాధ్యతలు తీసుకున్న నెల రోజుల్లోపు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా పయనం సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి, చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చొక్కా ధనంజయ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

విజయపురం, జూలై 12 ప్రభాతవార్త:

మండలంలోని మంగళం న్యూ ప్రాథమిక పాఠశాలలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య శుక్రవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులకు కావలసిన నోటు పుస్తకాలు, క్రయన్స్, పెన్నులు, పెన్సిల్ తదితర సామగ్రి వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కులశేఖర్, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిని సందర్శించిన రిషితారెడ్డి



రేణిగుంట, జూలై 12 ప్రభాతవార్త:

రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానినన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు చేస్తున్న సేవల పట్ల ఆరా తీశారు. మినరల్ వాటర్ ప్లాంటు, ఆపరేషన్ గదులను, ఓపీ కౌంటర్‌ని, శస్త్ర చికిత్స చేసే పరికరాలను, మందులను పరిశీలించారు. ఆస్పత్రి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కాలం చెల్లిన మందులను వినియోగించకూడదని సూచించారు. ఆస్పత్రికి ఎలాంటి అవసరాలు ఉన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమకూరుస్తామన్నారు. ఆమెతో పాటు రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, రేణిగుంట టౌన్ తెలుగు యువత అధ్యక్షుడు కిరణ్, పార్టీ సీనియర్ నేతలు మునస్వామి నాయుడు, డి.పుష్పనాథం, నగరి మునెయ్య, నెల్లూరు సుబ్రహ్మణ్యం, కన్నన్‌రెడ్డి, కొరియర్ రవి, దేవేళ్ళ రమణ తదితరులు ఉన్నారు.

## ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులు



**రేణిగుంట, జూలై 12 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం ఆర్ మల్లవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని కావ్య మొదటి ర్యాంకు సాధించి ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ తెలియజేశారు. అదే విధంగా గుత్తివారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని మేఘన మొదటి ర్యాంకు సాధించి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం తెలిపారు. వీరిద్దరిని మండల ప్రజలు అభినందిస్తున్నారు. మంచి చదువులు చదివి ఉత్తమ ర్యాంకులతో ఉత్తీర్ణులై ఉన్నత శిఖరాలు అధిరోహించి గొప్ప పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

## సుందరంగా కట్టమంచి, గంగినేని చెరువులు : ఎమ్మెల్యే



చిత్తూరు రూరల్, జులై 12 ప్రభాతవార్త: చిత్తూరు నగర పరిధిలోని కట్టమంచి, గంగినేని చెరువులను ఆధునిక హంగులకు సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు శుక్రవారం మేయర్ అముద, కమీషనర్ డాక్టర్ జె.అరుణ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి కట్టమంచి, గంగినేని చెరువు కట్ట ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో చెరువుల విస్తీర్ణం, కాలువల పొడవు, ఆక్రమణలు తదితర అంశాలపై చర్చించారు. కట్టమంచి, గంగినేని చెరువులకు సంబంధించిన సర్వే రికార్డులను తెప్పించి పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో చెరువులకు నీళ్ళు వచ్చే కాలువలను శుభ్రంగా వుంచాలని, కాలువల్లో అడ్డంకులను తొలగించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. చిత్తూరు నగర పరిధిలో ఆహ్లాదకర వాతావరణం కల్పించడానికి సుందరీకరణ పనులు పక్కాగా చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ డిఇ హీరాలాల్, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయశాఖ మంత్రిని కలిసిన విఎఎల సంఘం

**- సమస్యలు మంత్రికి వివరించిన యూనియన్ అధ్యక్షులు**

నాయుడుపేట, జులై 12 ప్రభాతవార్త : వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడుని అమరావతిలోని సచివాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ విఎఎల సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారంతో కూడిన వినతిపత్రాన్ని వారు వ్యవసాయశాఖ మంత్రికి అందించారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖలో బిఎస్సీ, బిజడ్‌సి చదివి విఎఎలుగా పనిచేస్తున్న ఉద్యోగులు అందరికీ తోటి టెక్నికల్ సిబ్బందిలాగానే అన్ని సౌకర్యాలు, పదోన్నతులు కల్పించాలని వారు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు మత్తమ్రి సింహారెడ్డితో పాటు తిరుపతి జిల్లా రైతు సేవా కేంద్రం బిజడ్‌సి ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి మోపూరు వెంకటసుబ్బయ్య, నాయుడుపేట సబ్‌డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు మంత్రికి వివరిస్తూ 2014-2019 కాలంలో టీడీపీ ప్రభుత్వంలో నాడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంపిఇఒల వ్యవస్థకు పురుడు పోశారన్నారు. నాటి నుంచి నేటి వరకు వ్యవసాయశాఖలో నాన్ టెక్నికల్ బిఎస్సీ, బిజడ్‌సి అభ్యర్థులుగా ఉద్యోగ ప్రవేశం చేసిన తమకు వైసీపీ ప్రభుత్వ హయాంలో తమపై కక్ష్యసాధింపు ధోరణి చూపారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న బిఎస్సీ, బిజడ్‌సిలకు చెందిన విఎఎలు, విహెచ్‌ఎలు అందరికీ ప్రమోషన్లలో అవకాశం కల్పించాలని లేనిపక్షంలో బిజడ్‌సికి చెందిన వ్యవసాయశాఖ సిబ్బంది విద్యార్హతలకు అనుగుణంగా మాతృశాఖలో గాని లేక ఇతర శాఖలకు బదిలీ చేస్తూ పోస్టింగ్ ఇవ్వాలని విన్నవించారు. అలాగే ఇతర శాఖల ప్రమేయం లేకుండా జీతభత్యాలతో పాటు ఇతర సర్వీసు సంబంధిత అంశాలను మాతృశాఖకు అప్పగించాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్న సిబ్బందికి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయడంతో పాటు రైతు సేవా కేంద్రాల వ్యవస్థకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే కీలక నిర్ణయాల సమయాల్లో చర్చలలో మరియు ఇతర కమిటీలలో ఆంధ్రప్రదేశ్ రైతు సేవా కేంద్రాల బిఎస్సీ, బిజడ్‌సికి చెందిన ఉద్యోగ సంఘాలను భాగస్వామ్యం చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఇందుకు మంత్రి తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారని తిరుపతి జిల్లా యూనియన్ అధ్యక్షులు సుధాకర్ ఈ సందర్భంగా చరవాణి ద్వారా 'ప్రభాతవార్త'కు తెలిపారు. అంతకుముందు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవులుకు సైతం వినతిపత్రం అందించామని ఉద్యోగ సంఘ నేతలు ఈ సందర్భంగా తెలియజేశారు.



వ్యవసాయశాఖ మంత్రిని కలిసిన ఉద్యోగ సంఘ నేతలు

## దుర్గమ్మకు గణనాధుని పట్టువస్త్రసాల బహూకరణ





కాణిపాకం, జులై 12 ప్రభాతవార్త: విజయవాడ దుర్గామల్లేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న ఆషాడమాస ఉత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం తరపున శుక్రవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఈమేరకు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ దంపతులు, ఈఓ ఎ.వెంకటేశు , ఆలయ అధికారులు, అర్చకులు శుక్రవారం విజయవాడ చేరుకుని అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలను సమర్పించేందుకు విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంకు చేరుకున్న వారికి దుర్గగుడి ఆలయ ఛైర్మన్ కెఎస్.రామారావు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. వీటిని అమ్మవారికి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పట్టు వస్త్రాలను తీసుకువెళ్ళిన ఎమ్మెల్యే, ఈఓ, అధికారులు, అర్చకులు, వేదపండితులకు ఆలయంలో అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి అమ్మవారి శేషవస్త్రాలను, చిత్రపటాలను అందించి సత్కరించారు. ఈకార్యక్రమంలో దుర్గమ్మ దేవస్థానం ఏఈఓలు సుధారాణి, చంద్రశేఖర్, రమేష్, కాణిపాకం ఆలయ ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ ఇన్‌చార్జి ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు,మండల టీడీపీ అధ్యక్షుడు మల్లార్లపల్లె గిరినాయుడులతో పాటు అర్చకులు వేదపండితులు, కాణిపాకంకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

**అమవారికి పట్టు వస్త్రసాలు సమర్పించడం నాపూర్వ జన్మసుకృతం:**

పవిత్ర ఆషాడమాసం సందర్భంగా దుర్గగుడిలో జరుగుతున్న ఉత్సవాల సందర్భంగ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం నాపూర్వ జన్య సుకృతమని స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలను సమర్పిచేందుకు వచ్చిన తమకు ఆలయం వద్ద ఘన స్వాగతం లభించిందని తెలిపారు. ఈరెండు ఆలయాలలకు వచ్చే భక్తులలకు కావలసిన సౌకర్యాల కల్పనకు సమిష్టితో కృషి చేస్తామని తెలిపారు.

## బాల్య వివాహాలు నిర్వహిస్తే.. చట్ట రిత్య చర్యలు : సిడిపిఓ



బాలాయపల్లి, జులై 12 ప్రభాతవార్త : డయేరియా నివారణ పై మోపూరు, దండవోలు ఎస్టీ కాలనీలో డయేరియా పై గ్రామస్తులకు సిడిపిఓ శంషాద్ బేగం అవగాహన సదస్సు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డయేరియాను అరికట్టవచ్చునని ఆమె తెలిపారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల తల్లి, శిశు మరణాలు సంభవించవచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## వస్త్రాలు పంపిణీ చేసిన పవన్ కళ్యాణ్

వి.కోట,జూలై 12 ప్రభాతవార్త: స్థానిక వి.కోట పట్టణంలో శుక్రవారం ప్రముఖ సమాజ సేవకులు యం.డి.హెచ్ ఫౌండేషన్ అధినేత పవన్ కళ్యాణ్ అధ్వర్యంలో వి.కోట సాయి గార్డెన్‌లో ప్రత్యేక ప్రతిభావంతులు,ఆదర్శ పాఠశాల విద్యార్థులకు, సంఘమిత్ర వృద్ధాశ్రమంలో ఉన్నటు వంటి వృద్ధులకు ఆహారం,వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోహిత్ కుమార్,ఆదర్శ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది మరియు సంఘమిత్ర వృద్ధాశ్రమం యాజమాన్యం,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రారంభమైన ధర్మరాజుల తిరునాళ్ళు

**-తొలిరోజు పురవీధుల్లో స్వామిఅమ్మవార్ల దర్శనం**



శ్రీకాళహస్తి, జూలై 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా చెన్నైరోడ్డులో వెలసి ఉన్న ద్రౌపతీదేవి సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా తీర్చిద్దారు, శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు ఈనెల 24వ తేదీ బుధవారం వరకు జరగనున్నాయి. శుక్రవారం ఉదయం శ్రీకృష్ణుడు, అర్జునుడు,ద్రౌపదీ దేవి విగ్రహాలను పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. దేవతా మూర్తుల విగ్రహాలను ఎంతో అందంగా అలంకరించి ఉత్సవాన్ని మద్రాసు రోడ్డు,జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి,నెహ్రూవీధి,నగరి వీధిలలో గ్రామోత్సవం సాగింది, ఉత్సవంతో పాటు ఆలయాధికారులు పర్యవేక్షించారు.

**ధర్మరాజుల ఆలయంలో ధ్వజారోహణం:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ధర్మరాజుల తిరునాళ్ళ శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమైంది. ఆలయంలోని ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఆవరణలో ఆలయాధికారులు, వేదపండితులు,స్థానిక పూజారులు శాస్త్రోక్తంగా హోమాలు ఏర్పాటు చేసారు.కలశ స్థాపనను ఆలయ అర్చకులు డాక్టర్ స్వామీనాధన్





గురుకుల్ సారధ్యంలో నిర్వహించారు. భక్తులు సమర్పించిన చీరలను అధిరోహింపజేసారు. పాండవ జననం,కౌరవ జననం కథతో అంకురార్పణ ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ ఇఓ ఎన్‌వియస్‌ఎన్ మూర్తి పర్యవేక్షణలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ధ్వజారోహణ కార్యక్రమాల్లో ఇఓ మూర్తి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్‌గురుకుల్, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య ల పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాల్లో శాసనసభ్యుని సతీమణి బొజ్జల రిషితారెడ్డి, మహిళా నాయకులు కృష్ణవేణి, చంద్రమ్మ,పట్టణ అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

## సిఏ, సిఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



తిరుపతి విద్య, జులై 12 ప్రభాతవార్త : సీఏ ఇన్స్టిట్యూట్ న్యూఢిల్లీ విడుదల చేసిన సీఏ ఇంటర్ ఫలితాల్లో స్థానిక ఎల్ఐసి రోడ్డులో ఉన్న ఎమరాల్డ్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు ఈ. గిరిధర్, కె. విశ్వనాథ్‌లు తెలియజేశారు. ఈ ఫలితాల్లో ఎం వెంకట్ యాదవ్ 402, ఏ చరణ్ సాయి 377, ఎం. దిలీప్ 365 మార్కులు సాధించి టాపర్లుగా నిలవడంతో పాటు మొత్తంగా 69.76 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సిఎంఏ ఇన్స్టిట్యూట్ కోల్‌కత్త విడదల చేసిన ఫౌండేషన్ ఫలితాల్లో ఏమరాల్డ్స్ విద్యార్థులు ఎం. రాధిక 312, ఎం. ప్రణవ్ 304, బి. లిఖిత్ 298, సి. సుశీలేంద్ర 292 మార్కులు సాధించి టాపర్లుగా నిలవడంతో పాటు మొత్తంగా 91.04 శాతం తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపసంచాలకులు మునిరత్నం, నాథముని, జానకిరాం, శ్రీనివాసులు, అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు.

## పారదర్శకత పెంపు కొరకే సామాజిక తనిఖీలు



వెదురుకుప్పం, జూలై 12 ప్రభాతవార్త : మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామి పథకం అమలు, పనులలో నాణ్యత, పారదర్శకత పెంపొందించడం కొరకు ఏటా సామాజిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి, మార్చి 2024 వరకుగల ఆర్థిక సంవత్సరంలో సుమారు పది కోట్ల రూపాయాల మేరకు వ్యయం చేయడం జరిగింది. పనులపై సామాజిక తనిఖీల బృందం సుమారు పది రోజుల పాటు మండలంలోని 25 పంచాయతీలలో తనిఖీలు చేపట్టారు. పరిశీలించి పంచాయితీల వారిగా ప్రజా వేదికలు నిర్వహించి తయారు చేసిన నివేధికలను శుక్రవారం మండల ప్రజావేదిక సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారిగా డిఆర్‌పిలు వారు క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను చదివి వినిపించారు. నివేదిక మేరకు జాతీయ ఉపాధి హామి పనులకు ఐదు వేల రూపాయాలు రికవరీ వచ్చిందన్నారు. ఉపాధి పథకం ద్వారా మామిడి మొక్కలు నాటిన రైతులు నిర్వహణ లేక చనిపోయిన చెట్లు తిరిగి పెట్టుకోవాలని లేని పక్షంలో రైతులు తీసుకున్న నగదు చెల్లించాలని ఆదేశించారు. మామిడి రైతులు మొక్కలు పెట్టకపోతే లక్ష పది వేల రూపాయాలు రీకవరీ చెల్లించాల్స ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్‌ఆఫీస్ గంగాభవని, ఏపిడి శోభన్‌బాబు, ఎస్‌టియం. లోకేష్ రెడ్డి, వ్ఆర్‌పి మల్లికార్జున, డిపియం రవి, ఇవోపిఆర్‌డి పురుషోత్తం, ఏపివో ఇందు, సాంకేతిక సహాయకులు క్షేత్రసహాయకులు, కార్యదర్శులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డ్ ప్రారంభం



తిరుపతి హెల్త్, జులై 12 ప్రభాతవార్త : ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో రుయా ఆసుపత్రి మానసిక వైద్య శాస్త్ర విభాగంలో నెలకొల్పారు. మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డ్ నందు చైర్ పర్సన్‌గా రిటైర్డ్ డిస్టిక్ జడ్జ్ పిఆర్ రాజీవ్ నియమితుల య్యారు. ఆయనతో పాటు ఐదు మంది సభ్యులు ఇందులో నియమించడం జరుగుతుందన్నారు. మానసిక రోగులకు కలిగే అసౌకర్యాలు గురించి వీరికి తెలియజేసి, న్యాయ సలహాలు, వైద్య రంగంలో వారికి కావాల్సిన వైద్యం అందించడానికి ఈ మెంటల్ హెల్త్ బోర్డు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ మెంటల్ హెల్త్ బోర్డు మూడు జిల్లాలకు చిత్తూరు, తిరుపతి నెల్లూరు జిల్లాల అనుసంధానంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పిఆర్ రాజీవ్, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి తెలిపారు. ఈ బోర్డు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. మానసిక రోగులకు కలిగే ఇబ్బందులను ఈ బోర్డు ద్వారా వారికి తగు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డు అవగాహన కార్యక్రమాలు ప్రజలకు, రోగులకు అందుబాటులో ఉండేలా రూట్ మ్యాప్‌ను తయారు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ బోర్డు నందు ఆరు మంది సభ్యులను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీత, మెంటల్ హెల్త్ బోర్డ్ సభ్యులు డాక్టర్ మల్లికార్జున రావు, డాక్టర్ రుషేంద్ర, డాక్టర్ భూపాల్ నాయుడు, స్వచ్ఛంద సేవా సంస్థ పి. తాయారు, ఎస్వీ వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని నాలుగేళ్ళలో అభివృద్ధి చేస్తా : ఎంఎల్ఏ



రామచంద్రాపురం, జూలై 12 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గాన్ని వచ్చే నాలుగేళ్ళలో అభివృద్ధి చేస్తానని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా మంజూరైన నిధులకు సంబంధించిన వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసర పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పశుసంవర్ధకశాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు పెండింగ్‌లో వున్న వేతనాలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఐసిడిఎస్‌లో ఖాళీగా వున్న పోస్టులు, అంగన్ వాడిలలోని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. చిగురువాడ నుండి రాయలచెరువు కట్ట వరకు సిసి కెమెరాలను ఏర్పాటుచేసి నేరాలను నియంత్రిస్తామన్నారు. పార్టీలకతీతంగా హౌసింగ్ బిల్లులు చెల్లించాలని ఏఈ మహేశ్వర నాయుడును ఆదేశించారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో వున్న భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కేశవులు నాయుడు, ఎంపిడిఓ ప్రత్యూష, తహాశీల్దార్ ఉషారాణి, అడిషినల్ సిడిపిఓ జ్యోతి, పిఆర్‌డిఈ సేతుమాదవ్, ఆర్అండ్‌బి డిఈ సూర్యనారాయణరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, టిడిపి నాయకులు జనార్ధన్ చౌదరి, కోరా హరిప్రసాద్, జెడి జగన్, విజయకుమార్ రాయల్, నరశింహారెడ్డి, ఢిల్లీనాధ రెడ్డి, మునిరామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సురేష్ నాయుడు, రావిళ్ళ గిరి, తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృత వర్సిటీలో ముగిసిన బ్రిడ్జ్ కోర్స్



తిరుపతి విద్య, జులై 12 ప్రభాతవార్త : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం శుక్రవారం ఆచార్య పిజి కోర్సుల్లో నూతనంగా ప్రవేశం పొందినటువంటి విద్యార్థులకు విశ్వవిద్యాలయంలో బోధించేటువంటి 15 శాస్త్రాల ప్రాథమిక పరిచయాన్ని విద్యార్థులు తెలియజేయడానికి ఈ నెల 8వ తేది నుంచి 12 వ తేది వరకు నిర్వహించిన సేతపాఠ్యక్రమం (బ్రిడ్జి కోర్స్) సమాపనం శుక్రవారం విశ్వవిద్యాలయ ప్రముఖ రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియం ముందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అకాడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత శుక్ల ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం సారస్వతాతిథి విశ్వవిద్యాలయం యొక్క ప్రోక్టార్ ప్రొ. సత్యనారాయణ ఆచార్య విశ్వవిద్యాలయంలో ఈ సేతు పాఠ్యక్రమం ద్వారా సంస్కృత శాస్త్రాల జ్ఞానాన్ని ఈ వారం రోజుల పాటు ఈ కోర్స్ ద్వారా అందించడం జరిగిందని వివరించారు. అనంతరం బ్రిడ్జి కోర్స్ కోఆర్డినేటర్ ప్రొ. సిరంగనాథన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కూడా నూతనంగా ప్రవేశించేటువంటి విద్యార్థులు ఎవరైతే ఉన్నారో, వారికి సంస్కృతంలో 15 పైగా ఉన్నటువంటి శాస్త్రీయాంశాలను ప్రాథమిక పరిచయంగా ఈ బ్రిడ్జ్ కోర్స్ కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అడిషనల్ కోఆర్డినేటర్ డా. యశస్వి సభాసంచాలకులుగా వ్యవహరించి దిగ్విజయంగా నిర్వహించారు.

## కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌కు అటానమస్ హోదా : ఛైర్మన్ బి.సి నాగరాజ్



కుప్పం, జూలై 12 ప్రభాతవార్త : కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌కు న్యూఢిల్లీ యు.జి.సి.చే పదేళ్ల పాటు అటానమస్ హోదా (స్వయం ప్రతిపత్తి) లభించినట్లు కళాశాల ఛైర్మన్ బిసి నాగరాజ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యుత్తమ విద్యా,నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులను తీర్చిదిద్దుతూ తమ కళాశాల బోధన, పరిశోధనల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించినట్లు పేర్కొన్నారు. కుప్పం లాంటి మారుమూల ప్రాంతంలో ప్రారంభించిన కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌కు ఎన్‌బిఎ, నాక్ ఎ గ్రేడ్ హోదా సైతం లభించాయన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపుగా అటానమస్ నేపథ్యంలో తమ కళాశాల నేడు సాంకేతిక రంగంలో పాఠ్యాంశాలు రూపకల్పన చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని పేర్కొన్నారు. విద్యారంగంలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నిష్ణాతులైన అధ్యాపకులతో పరిశ్రమల అవసరాలకు గుర్తించి తదనుగుణంగా తమ కళాశాల ముందుకు సాగుతోంద న్నారు. ప్లేస్‌మెంట్ లవిషయంలో సైతం ప్రపంచంలోని మల్టీ నేషనల్ కంపెనీలలో తమ విద్యార్థులు ఉద్యోగాలు పొందేలా కృషి చేశామన్నారు. సివిల్, మెకానికల్, ఇంజనీరింగ్, ఎఐ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ విభాగాల్లో యుజి, పిజి కోర్సులను అందిస్తున్నామన్నారు. పరిశోధనలకు పెద్దపీట వేస్తూ పిహెచ్‌డి కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్‌ను ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఓ సాగర్‌రాజ్ అభినందించారు.